# మనోదృశ్యం

- పి.ఎస్.నారాయణ

"చిరంజీవి మధుబాబూ!

ఆశీర్వచనాలు. కులాసాగా ఉన్నావని తలుస్తాను. అమ్మ పోయిందని తెలిసింది. కన్నతల్లి కళ్లముందు లేదనుకోవడం ఏ జీవికైనా భరించలేని బాధే. పాతిక సంవత్సరాల అనుబంధాన్ని, ఆత్మీయతను, అనురాగాన్ని పోగొట్టుకున్నామనుకోవడం చాలా కష్టమైన పనే అయినా తప్పదు. దేముడి నిర్ణయాన్ని కాదనే శక్తి మనకెక్కడిది.

జాగ్రత్తసుమా!

ఉంటాను.

-నీ శ్రీయోభిలాషి"

వెనక్కుముందుకూ తిప్పి చూశాడు మధు ఆ ఇన్‌లాండ్ లెటర్‌ను. ఎవరు రాశారో తెలియడంలేదు. చిరునామా లేదు.

ఏ ఊళ్ళో పోస్టయిందో చూద్దామన్నా దాని పైన కొట్టిన ముద్దర ముద్దముద్దగా ఉండి తెలియకుండా ఉంది.

చాలా విచిత్రంగా అనిపించింది ఆ లేఖ చూస్తుంటే అతనికి. అంత రహస్యంగా ఉండిపోవల్సిన తన ఆ శ్రేయోభిలాషులెవరో ఎంత ఆలోచించినా అర్థంకావడం లేదు.

సరిగ్గా ఈ ఉత్తరం వచ్చి రెండు నెలలయింది.

★ ★ ★

పనివాడు ఆటో తేవడానికి వెళ్ళాడు. చేతిసంచీలో అవసరానికి ఉంటాయి అన్నట్లుగా ఓ జతబట్టలు పెట్టుకుని భుజానికి తగిలించుకున్నాడు. గోడనున్న సాయిబాబా ఫోటోను చూస్తూ దణ్ణం పెట్టుకున్నాడు.

మొదటి ఉత్తరం వచ్చిన సరిగ్గా వారంరోజులకు మరో ఉత్తరం..

"మధుబాబూ!

అమ్మ చేతి వంట తినక అప్పుడే నెలయింది కదూ. ఇప్పటికైనా నువ్వు వెంటనే ఒక నిర్ణయం తీసుకుని నిర్మలను వివాహం చేసుకోరాదూ.. అవును గదూ.. ఇప్పుడు ఏడూడి సూతకం.. మామయ్యకు అదే చెప్పు. నీ పెళ్ళయిందాకా నువ్వు మామయ్యా గారింట్లోనే ఉండు. లేదా అత్తయ్యను వచ్చి నీ దగ్గర ఉండమను. నువ్వు హోటల్ భోజనం చేసి మాత్రం ఆరోగ్యం పాడుచేసుకోకు.

మీ అమ్మ మాటకు నువ్వెంత గౌరవం ఇస్తావో నాకు తెలుసు. నా మాటకూ అంత విలువ ఇస్తే నేను ఎంతగానో సంతోషిస్తాను.

నీ శ్రేయస్సునే నేను సదా కాంక్షిస్తుంటాను.

ఉంటాను మరి!

- నీ శ్రేయోభిలాషి"

వడివడిగా ఆ ఉత్తరాన్ని అన్ని వైపులా తిప్పాడు మధుబాబు. ఎవరు రాసిందీ, ఏ ఊర్లో పోస్టయిందీ కూడా తెలియడం లేదు.

వాకిట్లో ఆటో ఆగిన చప్పుడు అయింది. చివరి సారిగా ఓ గ్లాసుడు మంచినీళ్ళు త్రాగి బయటకు వచ్చి తలుపు మూసి తాళం వేశాడు.

అప్పుడు ఉదయం ఏడుగంటలయింది. సూర్యుడు పైపైకి పోతున్నా డిసెంబరర్ చల్లదనం ఆయన విరజిమ్ముతున్న వేడినంతా హరించివేస్తోంది.

మొట్టమొదటిసారిగా మావయ్యా మీద అనుమానం వచ్చింది. తాను నిర్మలను వివాహం చేసుకోవడానికి తన అంగీకారాన్ని చెప్పకుండా నాన్చుతున్నాడు. కారణమేమీలేదు. తనకు కాబోయే భార్య కనీసం గ్రాడ్యుయేషన్ అయినా పూర్తి చేయాలి అనేది తన కోరిక.

ఈరోజుల్లో చదువులేకుండా చదువుకున్న వాళ్ళ మధ్య మెలగడం చిన్నతనంగా ఉంటుంది. అంతేకాదు రేపు పుట్టబోయే పిల్లలకు చదువు విషయంలోనైనా కాస్త చేదోడువాదోడుగా ఉంటుందనేది ఆశ. ఆవిడగారు ఉద్యోగాలు చేసి తనకేం సంపాదించి పెట్టనక్కర్లేదు. నిర్మలకయితే అందమున్నది గానీ చదువుమీద ఎలాంటి ఇష్టం లేదు. ఎంతసేపూ షోకులూ, అలంకారాలూ కాకపోతే ఏ సినిమా చూద్దామా. ఏ టీవీ సీరియల్లో లీనమైపోదామా అనేదే యావ.

ఐదు సంవత్సరాలబట్టీ ఆ డిగ్రీ కోసం కుస్తీపడుతోంది.

తను ఈ మెలికన్నా పెడితే అది గ్రాడ్యుయేట్ అవుతుందని, తనకు గౌరవ ప్రదంగా ఉంటుందనీ తన ఆలోచన. ఆ కారణంతోనే తను అటూ ఇటూ తేల్చకుండా చదువు, చదువు అని నసుగుతున్నాడు.

అందుకుగాను తన మామయ్యా తన మీద ఇలాంటి ఒత్తిడి తేవడానికి ప్రయత్నించడం లేదు కదా! అలాంటి పనిచేసినా చేసేటంత ఘనుడే. అప్పుడప్పుడూ కాస్త అతి తెలివి ప్రదర్శిస్తుంటాడు.

కానీ మామయ్యా చేతి రాత తనకు తెలుసు. ఆయన దస్తూరి కాదిది. ఎవరితోనైనా రాయించాడేమో ఆలోచించాలి. అలా ఆలోచిస్తుండగానే మరో ఉత్తరం వచ్చింది.

"మధుబాబూ!

నీ పన్నెండో ఏట అనుకుంటాను... ఒక కోయదొర వచ్చి నిన్ను చూస్తూనే నీకు ఇరవై అయిదో ఏట రాజయోగం ప్రారంభం అవుతుందని చెప్పాడు"

చటుక్కున తలెత్తాడు మధుబాబు. నిజమే. అమ్మ తనకు ఎప్పుడూ చెప్పి ఎంతో మురిసిపోతుండేది. రాజయోగమంటే తనకు కాస్త ఊహ తెలిసేంతవరకూ ఆమె ఆ మాట అన్నప్పుడల్లా "ఏవిటమ్మా" అంటూ అడుగుతుండేవాడు.

"ఏవీ లేదు. నువ్వు కాలుక్రింద పెట్టకుండా అన్ని భోగాలూ రాజాలా అనుభవిస్తావన్నమాట" అంటూ మురిపెంగా తన్నే చూస్తూ నవ్వేది.

"మీ అమ్మ ఆ మాట చెప్పి మురిసిపోతున్నప్పుడల్లా నేను హెచ్చరిస్తూండేదాన్ని. 'దిష్టి తగులుతుంది ఎవ్వరితో అనబోకు'అని"

తనకు గుర్తే అమ్మ చీటికిమాటికీ ఇంత ఉప్పు తెచ్చి తన తలచుట్టూ అటూ ఇటూ తిప్పి

'ఛూ...ఛూ' అంటూ దొడ్లో పారేసి వచ్చేది.

అమ్మ చేష్టకు తను పకపకా నవ్వుతుండేవాడు.

* * *

సరిగ్గా వారానికి మరో ఉత్తరం.

"అమ్మ ఎప్పుడూ అంటుండేది. మధుకు ఒక తమ్ముడో, చెల్లెలో ఉంటే ఎంత బాగుండేదో అని. కానీ దేవుడు ఇవ్వనప్పుడు ఉన్నదానితోనే తృప్తి పడాలి. అందుకే నీలోనే మరో మొగపిల్లవాడిని, మరో ఆడపిల్లని చూసుకుంటూ ఆనందిస్తుండేది. గుర్తుందా! నీకు అయిదో ఏడు వచ్చి స్కూలుకు పంపేటంతవరకూ మీ అమ్మ నీకు తలదువ్వి, జడ వేసి పూలు పెట్టి ముద్దుల వర్షం నీ మోముమీద కురిపించేది. అందుకే నువ్వు వివాహం చేసుకుని పదిమంది పిల్లలతో ఇల్లు కళకళలాడేలా చేస్తే మీ అమ్మ ఆత్మ ఎంతగా సంతోషిస్తుందో? రెండు సంవత్సరాల క్రితం నాన్న పోవడం ఒక దెబ్బయితే, ఇప్పుడు అమ్మ ఏం చేస్తాం భగవదేచ్ఛ తప్పదు మరి ఉంటాను.."



-సదా నీ ఆనందమే నా ఆనందంగా భావించే

నీ శ్రేయోభిలాషి''

నాన్న గుర్తుకు వచ్చాడు. ఆయన ఆప్యాయత గుర్తుకువచ్చింది. తన కోరిక ఏదైనా నాలిక మీద ఉండగానే తీర్చే ఆయన ఆత్రుత గుర్తుకువచ్చింది. అమ్మ అంటుండేది వాడు గనుక చెడిపోతే బాధ్యులు మీరే అని. ఆయన పక పకా నవ్వేసేవాడు.

"మధుబాబు చెడడు. వాడు ఎవరి పెంపకంలో ఉన్నాడో గుర్తుంచుకో'' ఆ మాట వింటూనే అమ్మ మురిపెంగా తనని పొదివి పట్టుకుని నవ్వేది.

ఉత్తరాన్ని అటూ ఇటూ పట్టుకుతిప్పాడు. ఈసారి స్టాంపుమీద పడిన ముద్రలో కొన్ని అక్షరాలు అస్పష్టంగా కనబడుతున్నాయి. అది మంగుళూర్‌లో పోస్ట్ చేసిన ఉత్తరంలాగా ఉన్నది.

మంగుళూర్ అనుకుండేటప్పటికల్లా తనింట్లో అద్దెకుండి వెళ్ళిన ప్రహ్లాద రావు గారు గుర్తుకువచ్చారు. వాళ్ళ పెద్దల్లుడు ఇప్పుడు ఉద్యోగరీత్యా అక్కడే ఉన్నాడు. రెండు సంవత్సరాల క్రితం ఈయనా రిటైరవ్వడంతో అక్కడికే చేరారని ఆ మధ్య మాటల్లో అత్తయ్య అన్నది.

వాళ్ళు తనింట్లో పదేళ్లకు పైగా అద్దెకు ఉన్నారు. ఆయన్ను మావయ్య అని, ఆయన భార్య రుక్మిణమ్మ గారిని అత్తయ్యా అని తను పిలుస్తుండేవారు. వాళ్లకు ముగ్గురూ ఆడపిల్లలే అవ్వడంతో తనని ఎంతో ఆప్యాయంగా ఆమె ఎప్పుడూ దగ్గరకు తీసుకుంటుండేది. ఇంట్లో చేసిన ప్రతిదీ కూతుళ్లతో సమానంగా తనకూ పెడుతుండేది.

అమ్మ ఎప్పుడూ అంటుండేది. ఒక మొగపిల్లాడుంటే ఆదంపతులు ఎంతగా సంతోషించే వాళ్లోనని.

నాలుగేళ్ల క్రితం ఆయన ఈ ఊరినించి ట్రాన్స్‌ఫర్ అయి వెళుతున్నప్పుడు ఆమె తనను విడిచి వెళ్లడానికి ఎంతో వేదన చెందింది. ఆరోజంతా తనని వదిలిపెట్టనేలేదు. "మధుబాబు...మధుబాబు'' అంటూ ప్రతిదానికీ ఏదో కారణంతో పిలుస్తూనే ఉంది. వెళ్లేరోజున తనకు ప్యాంటు, షర్టు రెడీమేడ్‌లో అంకుల్ చేత తెప్పించింది.

తనకు ఆనాటి దృశ్యం కళ్లముందు కదలసాగింది. ఆమె చివరకు ఆటో ఎక్కుతూ "మధుబాబూ! మమ్మల్ని మరచిపోవు కదా'' అని తన చేతులు పట్టుకు ఊపుతుంటే ఆమె కళ్లల్లో తడి తనకు స్పష్టంగా కనబడింది.

ఆమెకు తన మీద ఎంతో ప్రేమ ఉన్నమాట నిజమే కానీ తనింటినుంచి వెళ్ళిన తరువాత ఇంతవరకూ ఉత్తరం రాయనివాళ్ళు వెళ్ళిన కొత్తల్లో ఒకటి రెండు రాశారేమో తనకు గుర్తులేదు. ఇప్పుడు శ్రేయోభిలాషినంటూ ఉత్తరం రాయవలసిన అవసరం ఏమున్నది? అంత రాయాలనుకుంటే తన పేరుమీదే రాయవచ్చు కదా!

అర్థంకావడం లేదు మధుబాబుకు.

తనకు తెలిసినంతవరకూ వాళ్ళు తప్ప మంగుళూర్‌లో తమ విషయాలు అంతగా తెలిసినవాళ్ళు మరెవ్వరూ లేరు. గార్డెన్స్‌లో ఇల్లు కట్టుకున్నప్పుడు గృహప్రవేశానికి అమ్మా నాన్నతో తనూ వెళ్లాడు.

ఆటో బస్టాండ్‌లో ఆగుతుండగా ఉలిక్కిపడ్డట్టుగా ఆలోచనలు తెగిపోయాయి.

నీరసంగా బయటకు వెళుతున్న ఎర్రబస్సుల వంక చూస్తూ నిలబడిపోయాడు మధుబాబు.

భుజానికి వ్రేలాడుతున్న ఒక జతే బట్టలుపెట్టి ఉన్న సంచీ కూడా ఆ క్షణాన చాలా బరువుగా ఉన్నట్లనిపించింది. సంచీని ఎడమ భుజం మీదనుంచి కుడి వైపునకు మార్చుకున్నారు.

తను చాలా రోజులయింది ఇటు పక్కకు వచ్చి. అమ్మ పోయినప్పుడు అస్థికల నిమజ్జనానికి అమరావతి వెళ్లాడు గానీ అప్పుడు తాలుకాఫీసు ముందు బస్సెక్కాడు. బస్టాండ్‌కు రావల్సిన అవసరం పడలేదు.

అటూ ఇటూ చూస్తూ తనకు కావలసిన బస్సు ఏ ప్లాట్‌ఫారం మీద ఆగుతుందో అనుకుంటూ నడుస్తున్నాడు.

ఆరోజు తను ప్రహ్లాదరావుగారి చెల్లెలు ఇంటికి వెళ్లేటప్పటికి ఆమె వరండాలోనే కూర్చుని కనబడింది. తనను చూస్తూనే లేచి ఆహ్వాన సూచకంగా నవ్వింది.

"అంకుల్ వాళ్ళు మంగుళూర్‌లో ఉంటున్నారట కదా. వాళ్ళ ఫోన్ నెంబర్ కావాలి. చాలా రోజులైంది ఆంటీతో మాట్లాడి'' అన్నాడు గడప మీద కాలు పెడుతూనే.

"ఈమధ్య ఫోన్ చేస్తే చెప్పాను మీ అమ్మగారు పోయిన సంగతి...చాలా బాధపడ్డది... ఉత్తరం రాస్తానన్నదే''

తడబడ్డాడు మధుబాబు. "లేదు...రాయలేదు'' అన్నాడు గొణుగుతున్నట్లుగా.

"ఆంటీకి నేనంటే ఎంతో అభిమానం కూడా'

## ఆదా

సుగుణమ్మ పక్కింటి తులసమ్మను అడిగింది "మీవారు ఏసి రూమ్‌లో రెస్ట్ తీసుకుంటున్నారని ఇందాక చెప్పావుగా. నేనిప్పుడు మా డాబా మీదకు వెళ్తే మీ డాబా మీద పిల్లర్స్‌పై కట్టిన వాటర్‌టాంక్ క్రింద మీవారు చాప వేసుకుని పడుకున్నారేంటి?''

"కరెంట్ బిల్లు దెబ్బకు తట్టుకోలేక ఈ రోజు నుండి అదే ఏసి రూమ్‌గా వాడుకోమని ఆయనకు నేనే సలహా ఇచ్చానులే'' అని జవాబు చెప్పింది తులసమ్మ.

-టి.లక్ష్మి (విశాఖపట్నం)

## సంతోషం

"శ్రీమతీ! నీ ముఖంలో ఎల్లప్పుడూ సంతోషం చూడాలంటే నేనేం చేయాలి?''


"రోజూ మీరే వంట చేయాలి'' అంది భార్య.

## అందుకే!

"మీరు భార్యతో సుఖంగా, సంతోషంగా గడపడం ఎలా? అనే పుస్తకం వ్రాసారుకదా. ఇంతకూ మీరు మీ భార్యతో సుఖంగా, సంతోషంగా వుండేవారా?''

"అలా గడపనందుకే ఆ పుస్తకం వ్రాయగలిగాను.''

-షేక్ అస్లాం షరీఫ్ (శాంతినగర్)



"మా వదినకు మొగపిల్లలంటే తగని ప్రేమ..ఆమెకు లేదు గదా మరి"

తరువాత పావుగంటకు ఆమె ఇచ్చిన కాఫీ త్రాగి, ఫోన్ నెంబర్ తీసుకుని బయటకు వచ్చాడు 'రాత్రికి ఈ రహస్యానికి తెరదీయాలి' అనుకుంటూ.

కాని ఎంత ఆలోచించినా పేరు లేకుండా శ్రేయోభిలాషినంటూ ఉత్తరం రాయాల్సిన అవసరం వాళ్లకు ఎందుకు కలిగిందో అర్థం కావడం లేదు. పోస్టల్‌స్టాంప్ చూస్తుంటే అది మంగుళూర్ నుంచే వచ్చినట్లుగా ఉంది. ఆపైన అంకుల్ చెల్లెలు చెప్పినట్లుగా అమ్మ పోయిన సంగతి వాళ్లకు తెలుసు. ఆంటీ ఉత్తరం రాస్తానని గూడా అన్నదట. అసహనంగా నడుస్తున్నాడు మధుబాబు.

అలాంటి ఉత్తరాలు రాస్తూ తనని అయోమయంలో పడేసి మనస్తాపం కలిగించడంలో ఆంటీ ఉద్దేశ్యమేమిటో తెలుసుకోవాలి. ఇదేదో సరదాగా చేస్తున్న పని మాత్రం కాదు.

రాత్రి ఎనిమిదిన్నర అవుతుండగా ఫోన్ అందుకుని మంగుళూర్ నెంబర్‌కి తిప్పాడు. మధుబాబు చేతివేళ్ళు తడబడుతున్నాయి. తను కఠినంగానే మాట్లాడాలి. ఫోన్ అవతలపక్కన రింగ్ అవుతున్న శబ్దం.

ఎత్తింది ఆంటీనే!

"నేను మధుబాబుని. గుంటూరు నుంచి మాట్లాడుతున్నాను. ఆంటీయేనా మాట్లాడుతున్నది. గుర్తుపట్టారా ఆంటీ..బ్రాడీపేటలో మా ఇంట్లో చాలాకాలం మీరు అద్దెకున్నారు. శారదాంబగారి అబ్బాయిని"

"మధుబాబు..మధుబాబు...నువ్వా!" చాలా ఉద్రేకంగా ఉన్నదా కంఠం.

"ఈమధ్యనే మా ఆడబడుచు చెప్పింది. అమ్మ పోయిందిట కదా! చాలా బాధ వేసిందయ్యా. అప్పటినుంచీ నీకు ఫోన్ చేద్దామనే అనుకుంటున్నాను. ఇదిగో మేం మంగుళూర్ వచ్చేటప్పుడు సామాన్లు సర్దడంలో టెలిఫోన్ నెంబర్ల పుస్తకం ఎక్కడ పెట్టామో కనబడడం లేదు. ఒక్కడివే ఉంటున్నావా ఇంట్లో. హోటల్ భోజనమేనా.. పోనీ పెళ్లయిందాకా అత్తయ్య వాళ్లింట్లో ఉండడమో, లేకపోతే వాళ్లనే వచ్చి నీ దగ్గర ఉండమనడమో చేయాల్సింది. ఎట్లాగయినా రేపు పెళ్ళి చేసుకుంకునేది వాళ్లమ్మాయి నిర్మలనే కదా. మా ఆడబడుచు చెప్పిందిలే ఇంకా నీ పెళ్ళి కాలేదని...ఇప్పుడెట్లాగో చేసుకోవడానికి వీల్లేదు... ఏడూడి సూతకమాయె"

మధుబాబు మాట్లాడలేకపోతున్నాడు.

అతడి దవడలు బిగుసుకుపోతున్నాయి. ఆ ఉత్తరాల్లో రాసిందే ఆమె చెబుతున్నది. అన్నీ తెలిసిన ఆమె శ్రేయోభిలాషి అవతారం ఎందుకు ఎత్తవలసి వచ్చిందో!

"మీ అమ్మ చెబుతుండేది గదూ ఎప్పుడూ...నీకు పెళ్ళీడు వచ్చేటప్పటికి మహారాజయోగముందని..నిర్మల మీ ఇంట్లో కాలు పెట్టడమంటే నువ్వు స్వర్గంలో కాలు పెట్టినట్లే. నీకు నిర్మల ఉన్నది గాబట్టి నేను నిన్ను వదిలేశాను గానీ లేకపోతేనా మా ఇంటికి అల్లుడిగా తెచ్చుకుండేదాన్ని ఈపాటికి"

ఆమె గలగలా పరిగెడుతున్న గోదావరిలా మాట్లాడేస్తోంది. అంటే తను అల్లుడు కాలేకపోయినందుకు ఈర్ష్యతో ఈలాంటి వెధవపనులు చేస్తున్నదా?

ఇందులో ఏదో నిగూఢత ఉంది తెలుసుకోవాలి.

కోపంతో అతడి చేతివేళ్ళు ఫోన్ రిసీవర్ చుట్టూ బిగుసుకుపోతున్నాయి.

"నేను ఒక్కటి అడుగుతాను చెప్పండి ఆంటీ!" విసురుగా అన్నాడు మధుబాబు ఆమె మాటల్ని త్రుంచేస్తున్నట్లుగా.

ఆమె అదేమీ పట్టించుకోనట్లుగానే "ఇక్కడైతే అంతా కులాసానమ్మా. రెండోది పెళ్ళి చేసుకుని అమెరికా చెక్కేసింది. మీ మావయ్యగారు రిటైర్ అవుతుండగానే మా పెద్దల్లుడు వచ్చి మమ్మల్ని ఇక్కడు తీసుకువచ్చాడు. చివరిది ఇంజనీరింగ్ ఫైనలియర్లో ఉన్నది. బెంగుళూర్‌లో హాస్టల్లో ఉండి చదువుకుంటున్నది. మామయ్య గారు చేతిలో పనిలేక కాలుగాలిన పిల్లిలా ఇంట్లోకి వాకిట్లోకి తిరుగుతుంటారు. ఇప్పుడే ఇక్కడకు దగ్గరిలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి గుళ్ళో ఏవో ప్రత్యేక పూజలున్నాయంటే అరగంట క్రితం వెళ్లారు. ఆయన ఉంటే ఆయనతో కూడా మాట్లాడేవాడివి..." చెప్పుకుపోతున్నది.

"ఆంటీ..." అసహనంగా అరిచాడు మధుబాబు ఆమె మాటలకు చికాకుపడుతూ.

అవతల క్షణంలో నిశ్శబ్దమేర్పడింది అతడి కంఠానికి సమాధానం అన్నట్లుగా.

"...నేను చెప్పేది కాస్త వింటారా?" అన్నాడు విసురుగా.


ఆమె నీరసపడిపోయినట్లుగా "చెప్పు" అంది రెండుక్షణాల మౌనం తర్వాత.

"ఎందుకు మీరు శ్రేయోభిలాషినంటూ పిచ్చిపిచ్చి ఉత్తరాలు రాస్తున్నారు నాకు?...నానుండి ఏమి ఆశించి అలాంటి ఉత్తరాలు రాసి నాకు మనస్తాపం కలిగిస్తున్నారు. రాయదలుచుకున్నదేదో ధైర్యంగా, స్పష్టంగా రాయవచ్చు కదా... ఈ డొంక తిరుగుడంతా దేనికి? అసలు దేనికోసం రాస్తున్నారు ఈ ఉత్తరాలన్నీ... నా క్షేమం కాంక్షించేనా?" ఆ కంఠంలో కోపమేకాదు. బాధ, వేదనా



## విజయాలు మామూలే

సినిమా ఇండస్ట్రీ హీరోలకి బ్రహ్మరథం పడుతుంది. అయితే ఈ రంగంలో కొంతమంది హీరోయిన్స్ కూడా తమ అస్థిత్వాన్ని నిలుపుకుంటూ ముందుకి సాగుతుంటారు. నాచ్, మొగల్ ఎ అజమ్, ఐత్‌రాజ్, వీర్ జారా చిత్రాలతో కొంతమంది హీరోయిన్స్ తమ సత్తాని నిరూపించుకున్నారు. రాణీముఖర్జీ కూడా తమ తోటి హీరోయిన్లు ఇలా సక్సెస్ సాధించడంపై ఆనందం వ్యక్తం చేస్తోంది. ఎవరికైనా టైం వస్తుందని, దాన్ని సద్వినియోగం చేసుకుంటే ఇలాంటి విజయాలు మామూలే అవుతాయంటోంది.



కూడా ఉంది.

"మధుబాబూ! నువ్వేం అంటున్నావో నాకేం అర్థంకావడం లేదు" ఎంతో హుషారుగా మాట్లాడుతున్న ఆమె కాస్తా క్షణంలో నీరసంలోకి జారిపోయింది.

"నాకు మంగుళూర్ నుంచి నీ శ్రేయోభిలాషినంటూ రకరకాల ఉత్తరాలు వస్తున్నాయి. అక్కడ మీరు తప్ప నాకు తెలిసినవాళ్ళు మరెవ్వరూ లేరు" కఠినంగా అన్నాడు.

"ఇకనుంచైనా మీరు రాయడం ఆపుచేస్తే నాకు మనశ్శాంతి లభిస్తుంది. నాకు ఎంతో మేలు చేసినవాళ్లవుతారు"

కొద్దిక్షణాల భారమైన నిశ్శబ్దం తర్వాత "నువ్వు పొరబాటు పడుతున్నావు మధుబాబూ! అలాంటి ఉత్తరాలు రాయాల్సిన అవసరం మాకు లేదు. అసలు మీ ఇల్లు వదిలి వచ్చిన తర్వాత నీతో మాట్లాడడం ఇదే ప్రథమం. నువ్వెందుకో పొరబడుతున్నావ్. నీ నెంబర్ చెప్పు... మామయ్యగారు రాగానే ఫోన్ చేయిస్తాను" అంది చాలా లోగొంతుకతో ఆమె అతడి మాటలకు డీలాపడిపోయి నీరసంగా.

"ఎక్కడో ఏదో పొరబాటు జరిగినట్లున్నది...మామీద అనవసరంగా అపోహపడుతున్నావు.. అసలు అలా రాయవలసిన అవసరం మాకేమిటి?"

"నేనూ అదే మాట్లాడుతున్నాను" విసురుగా అనేసి ఫోన్ రిసీవర్‌ను తక్కువ క్రెడిల్ చేసేశాడు.

తరువాత కళ్ళు మూసుకుని మంచం మీద పడుకుంటే తను గాని తొందరపడలేదు కదా అనే అనుమానం రాగా కొన్ని క్షణాలు తత్తరపడ్డాడు. అనవసరంగా వారిమీద నింద వేశాడా? కవర్ తీసి మరోసారి చూశాడు. ఆ అక్షరాలు అంతగా స్పష్టంగా లేకపోయినా మంగుళూర్‌లాగానే ఉన్నాయి.

వాళ్ళు కాకపోతే మరెవ్వరు రాస్తారు? అందునా తన కుటుంబ విషయాలు, చిన్ననాటి విషయాలు వాళ్లకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియవు! గూడ లెగరేశాడు చిరాగ్గా. ఛ ఛ! వెధవ గొడవ..

రెండురోజులు అలాంటి ఆలోచనలతో మథనపడుతుండగానే మరో ఉత్తరం వచ్చింది.

ఈసారి ఆ కవర్ మీద ముద్ర చాలా స్పష్టంగా ఉంది. అది మంగళగిరి నుంచి.

అది చూస్తూనే కలవరపడ్డాడు మధుబాబు.

త్వరత్వరగా క్రితం సారి వచ్చిన ఉత్తరం తీసి పోస్టల్ ముద్రలను పోల్చి చూశాడు. మొదటిది స్పష్టంగా లేకపోయినా రెండూ ఒకేచోట నుండి వచ్చినట్లుగా అర్థమయింది. అవును అవి మంగళగిరి నుంచే వచ్చాయి..

ఛ! తను అనవసరంగా ఆంటీ వాళ్లమీద అనుమానం పడి తొందరపాటుతో ఫోన్ చేశాడు. వాళ్ళు ఎంతగా బాధపడ్డారో.. మళ్ళీ ఫోన్ చేసి క్షమాపణలు చెప్పుకోవాలి. మనస్సంతా వ్యాకులపాటుతో మ్లానమయింది.

ఆరోజు వచ్చిన కవర్ చించాడు అసహనంగా.

"మధుబాబూ!

సూర్యుడు, చంద్రుడు, దిక్పాలకులు..శాశ్వతమవ్వవచ్చు గానీ మనుష్యులు కాదుగదా.. రెండు సంవత్సరాల క్రితం నాన్నపోయాడు.. మొన్నటికి మొన్న అమ్మ పోయింది. రేపు నీ శ్రేయోభిలాషులంతా కూడా ఒక్కొక్కరే కనుమరుగుకావచ్చు. కానీ అందరి ఆశీర్వాదాలు నీకు ఉండాలనే మనసా వాచా నేను కోరుకుంటున్నాను బాబూ! నువ్వు సుఖసంతోషాలతో ఈ భూమ్మీద స్వర్గసౌఖ్యాలు....కోయదొర చెప్పినట్లుగా మహారాజయోగం అనుభవించాలని కోరుకుంటున్నాను..

సర్వదా నీ శ్రేయోభిలాషినే"

కళ్ళు చికిలించి ఆ ఉత్తరాన్ని పదే పదే చదవసాగాడు.

అలా చదువుతుండగా కళ్ళ ముందు ఓ మెరుపు మెరిసింది. ఆ మెరుపులోనుండి ఓ మానవాకారం జరజరా క్రిందకు జారి నేలమీద తన ముందు నిలబడింది.

సన్నగా, పొడుగ్గా, రివటలా ఉన్న ఆమె తెల్లటి జుట్టును వేసుకుని ఉన్నది. పొడుగు ముఖం.. పెద్దపెద్ద కళ్ళు...నవ్వుతుండే పెదిమలు... ఆమెకూ తన అమ్మ వయస్సే ఉండి ఉంటుంది.

ఆమె పేరు.. ఆమె పేరు... శంకరమణెమ్మ.

అవును...ఆమెది మంగళగిరే!

కొండవాలులో చిన్న పూరింట్లో ఉంటూ తనకు తోచిన సేవ నలుగురికీ చేస్తున్నదట.

ఆమె తనింటికి అప్పుడప్పుడూ వస్తుండేది. ఆమె ఎందుకు వస్తుండేదో, తెలియదు గాని ఆమె రాక తన తల్లికి అంత ఇష్టంగా ఉండేది కాదని మాత్రం తనకు తెలుసు. ఆమె వచ్చిందంటే చాలు అమ్మ చికాకు పడుతుండేది. అదేమీ పట్టించుకోనట్లుగా ఆమె ఇంట్లో అన్ని మూలలా తిరుగుతుండేది.

ఆమె ఎప్పుడు వచ్చినా ఏవేవో పండ్లు, ఏకాలంలోవి ఆకాలంలో తెస్తుం



## పనితీరు

హాలీవుడ్ సినిమాలకి, బాలీవుడ్ సినిమాలకీ మధ్య ఎంతో తేడా ఉంటుంది. అయితే అక్కడ మనవాళ్ళెవరైనా పనిచేస్తే మరికొన్ని సంగతులు తెలుస్తాయి. అన్నట్టు మల్లికా షెరావత్‌ని కదిపితే హాలీవుడ్, బాలీవుడ్ సినిమాలకున్న తేడాల గురించి అనర్గళంగా చెబుతోంది. "ఇక్కడితో పోలిస్తే హాలీవుడ్ సినిమాల బడ్జెట్ ఎక్కువ. టాలెంట్ చూపించడానికి, మన గురించి, మన సత్తా గురించి తెలుసుకోవడానికి అవకాశం ఉంది" అంటోంది. మల్లికా పనితీరు జాకీచాన్‌ని కూడా ఆకట్టుకుంటోంది.



దేది. అమ్మ "ఎందుకు తెస్తావే అవన్నీ" అని అన్నా "నేను కొంటానా పెద తానా...వాళ్ళూ, వీళ్ళూ ఇచ్చినవేగా" అంటూ నవ్వేస్తుండేది.

ఒకసారి తను అమ్మను ఆమె వచ్చి వెళ్లిన తర్వాత "ఎవరే అమ్మా ఆమె?" అని అడిగాడు.

"చిన్నప్పుడు మేం ఇద్దరం కలిసి హైస్కూల్లో చదువుకున్నాంలే... అదుగో ఆంధ్రరాష్ట్రం వచ్చినప్పుడు హైకోర్టు గుంటూరులో పెట్టారుగా కొన్నాళ్ళు. అప్పుడు వచ్చారు వాళ్ళు మద్రాస్ నించి... తరువాత దానికి చదువయితే రాలే దుగాని ఎవడితోటో ప్రేమలో పడి పిచ్చిపిచ్చి వేషాలు వేసింది. వెధవ ముఖంది. ఇంట్లో చెప్పకుండా వాడితో లేచిపోయి వాడు మోసం చేస్తే తిరిగి ఇంటికి రాలేక అదుగో అప్పుడు ఎవరో చేరదీస్తే మంగళగిరిలో జేరి వాళ్ళకూ, వీళ్లకూ సాయబడుతూ బ్రతుకు వెళ్లదీస్తోంది. మంచి కుటుంబాన్నించి వచ్చినా జీవితాన్ని నాశనం చేసుకున్నది" అంది తల్లి విసుగ్గా.

"మనింటికి డబ్బు కోసమా వచ్చేది ఆమె?" తను అడిగాడు.

"ఏవో...వెధవ గోల" మాట త్రుంచేస్తూ అక్కడ నుంచి వెళ్ళిపోయింది తన తల్లి.

ఆమెకేమిటి అవసరం ఇప్పుడు ఇంతగా ఉత్తరాలు రాయడానికి?

మధుబాబు అత్తయ్య దగ్గరకు వెళ్ళాడు.

"మంగళగిరిలోనే గదూ అప్పుడప్పుడూ మనింటికి వస్తుండే శంకరమ ణెమ్మ ఉండేది?" అడిగాడు.

మేనత్త వింతగా మధుబాబు మొహంలోకి చూస్తూ అంది "ఆ పిచ్చిదా?"

"ఆమెకు పిచ్చా?" తనూ విచిత్రంగా అత్తయ్య ముఖంలోకి చూశాడు అందుకనేనేమో ఆమె తనకు అలాంటి ఉత్తరాలు రాస్తున్నది.

"ఆ...ఎప్పుడో చిన్నప్పుడు మీ అమ్మతో కలిసి చదువుకున్నదట.. అదీ స్నేహం ఆమెతో మీ అమ్మకు!"

"ఆమెను ఒకసారి చూసి రావలన్పిస్తున్నది. రేపు ఉదయం వెళ్దామనుకుం టున్నాను" అన్నాడు తలవంచుకుని మధుబాబు.

"ఆమెతో నీకేం పని మధూ!" అంది కళ్ళు విప్పుతం చేసుకుని అతడి ముఖంలోకి చూస్తూ.

"అమ్మ స్నేహితురాలు గదా..అమ్మ పోయిన సంగతి తెలుసో, తెలి యదో... తెలిస్తే తప్పకుండా వచ్చి ఉండేది. ఒక్కసారి వెళ్ళి వస్తే పోలేదు. తరు వాత ఆమె ఎవరిద్వారానో తెలుసుకుని బాధపడే దానికంటే" అన్నాడు తనకు వస్తున్న ఉత్తరాల సంగతి చెప్పకుండా.

అవి తప్పకుండా మంగళగిరిలో ఉన్న ఆమె దగ్గరినుంచే వస్తుండాలి అను కున్నాడు మరోసారి. మంగుళూర్ అనుకుని తను పొరపాటు పడ్డ విషయం గుర్తుకురాగా.

ఆ విషయాన్ని అంతటితో కత్తిరిస్తూ లేచి బయటకు వచ్చేశాడు మధు బాబు. అతడు వెళుతున్న వైపే చూస్తూ ఉండిపోయింది మేనత్త.

చటుక్కున ముందుకు అడుగులు వేశాడు మధుబాబు ఆ ప్లాట్‌ఫారం మీద తనకు కావలసిన ఎర్రబస్సు వస్తుండడంతో.

అది విజయవాడ వెళుతూ మంగళగిరిలో ఆగే ఆర్డినరీ బస్సు.

అందులోకి ఎక్కేశాడు.

* * *

దూరంగా కొండ మీద కనబడుతున్న తెల్లటి పానకాలస్వామి గుడి. క్రిందగా నరసింహస్వామి గుడి, ఎత్తయిన గాలి గోపురం.

మంగళగిరి మాంగుళూర్ అనుకుందే అతడు చిన్నప్పుడు ఎవరో అంటుండగా విన్న విషయం గుర్తుకురాగా పెదాలమీద చిరునవ్వు వెలసింది.

రైల్వేవారు మాంగుళూర్ స్టేషన్ అభివృద్ధికి డబ్బు మంజూరు చేస్తే అది మంగళగిరికి అనుకుకుని ఇక్కడ ఖర్చు చేశారట. అది నిజమో అబద్ధమో తెలి యదు గాని తను మాత్రం నిజంగా బోల్తాపడ్డాడు ఈ ఊళ్ళ విషయంలో.

బస్సు బయల్దేరింది చిన్నగా. మనస్సు పరిపరివిధాల పోతోంది. ఆమెకు తన కుటుంబ విషయాలు తన తల్లి స్నేహితురాలిగా తెలిసి ఉండవచ్చు. కానీ తనకు అలాంటి ఉత్తరాలు రాయడంలో ఆమె ఏమి ఆశిస్తున్నదో తనకు అర్థం కావడంలేదు.

లేకపోతే ఆమెను గురించి గూడా తను అపోహ పడుతున్నాడా? మాంగు ళూరు అంటీ విషయంలో తను అభానుపాలయినట్లు.

బస్టాండ్‌లో దిగి కొండ దగ్గరకు రిక్షా మాట్లాడుకుని ఎక్కి కూర్చున్నాడు. మెయిన్‌రోడ్డులో నుంచి కుడివైపు వల్లంలోకి దిగింది రిక్షా.

బాలాంబసత్రం దాటింది. ఎండిపోయిన కోనేరు దాటింది. గుడివెనుక వీధి లోనుంచి ముందుకు వచ్చి రథం పక్కగా వెళ్ళి శివాలయం ముందాగింది. దిగి డబ్బులిచ్చి పంపేశాడు.

కాసేపు అటూ ఇటూ చూసి గుడి ముందునుంచి, మెట్లపక్క చిన్న గోడ


## నీ చేతుల్లో మరణిస్తా!

"ఈ రేయి నీ చేతుల్లో మరణిస్తా" అని ఓ ప్రేమికుడు తన అజ్ఞాత ప్రేయసికి అక్షరాలా చెప్పిన సందేశమిది. తన చివరి కోరిక తీరితే (ఆమె తీర్చగలిగితే) ఆ అమ్మాయికి క్వార్టర్ మిలియన్ డాలర్లు ముట్టేలా ఓ విల్లు వ్రాసాడట 72 ఏళ్ళ రాల్ఫ్ ఏడెన్. అతను పెట్టిన కండిషన్ ఏమంటే ఆమెతో కోరిక తీరుతున్నప్పుడో, అది తీరిన వెంటనే అయినా అతని ప్రాణాలు పోవాలిట. ఇక ఆశ్చర్యమేముంది? నేనంటే నేనని ప్రపంచం నలు మూలల నుంచి అమ్మాయిలు ఈమెయిల్స్ పంపిస్తున్నారుట.

## నష్టపరిహారం

ఇటీవల ఆస్ట్రేలియాలోని పెర్త్‌లో 32 ఏళ్ళ పాల్‌హోగన్ అనే ఉద్యోగి ఒక కోర్టులో తను చదివిన మిషనరీ స్కూలుమీద ఓ కేసు వేసాడు. ఆ స్కూల్లో అతని పదమూడవ ఏట తోలు పటకాతో దేనికనో అతని కుడిచేతి మీద కొట్టారట. తానిప్పుడు ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ చేసినప్పటికీ, ప్రభు త్వంలో సీనియర్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించినప్పటికీ ఆ దెబ్బవల్ల 19 ఏళ్ళుగా అతనిలో ఒక న్యూనతాభావం ఏర్పడిపోయిందనీ, ఎంతో పైకి రావాల్సిన తాను ఇంతటితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని, న్యాయ విచారణ చేసి ఆ స్కూలు మీద తగిన చర్య తీసుకోవాలని కోరాడు. కోర్టు వారు అన్నీ పరిశీలించి, సాక్షుల్ని విచారించి ఆ కేథలిక్ చర్చివారు అతనికి 1.2 మిలియన్ డాలర్లు పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారుట.

-తటవర్తి



దాటి కొండ క్రింద ఇళ్ళ వైపునకు ఎవరో వెళుతుంటే ఆపి అడిగాడు. "ఇక్కడ కొండ క్రిందగా శంకరమణెమ్మ గారని ఒకామె ఉండాలి. ఆమె ఇల్లు మీకేమైనా తెలుసా?'' అంటూ.

"రండి. నేనూ అక్కడి వెళుతున్నాను'' అంటూ అతడు ముందు నడుస్తుం డగా అతడిని అనుసరించాడు మధుబాబు ఉత్సాహంగా. ఇంత తేలిగ్గా ఆమె ఇల్లు దొరుకుతుందని తను అనుకోలేదు.

ఆమెను కలవబోతున్నాను అనుకుంటేనే తెలియని ఉద్విగ్నత అతడిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రెండు మూడునెలలుగా తనను అయోమయంలో పడేస్తూ తన బుర్రతింటున్న ఒక సమస్యకు సమాధానం దొరుకుతుందేమో అనే ఆశ అతడిని బాగా ఉత్సాహపరుస్తూ వడివడిగా అడుగులు వేయిస్తోంది.

'పెద్దామె..ఆమె మాటల్లోలాగానే తన శ్రేయోభిలాషి..పండ్లు ఏమైనా తీసు కువస్తే బాగుండేదేమో!' అనుకున్నాడు.

ఆమె తనింటికి ఎప్పుడు వచ్చినా తెస్తుండేది అనే విషయం గుర్తుకురాగా కించిత్ చింతిల్లాడు గూడా. 'పోనీ వచ్చేటప్పుడు కొంత డబ్బు ఇచ్చి వస్తే ఆమెకు దేనికైనా ఉపయోగపడవచ్చు' అని తనకి తాను సర్దిచెప్పుకున్నాడు.

రాళ్ళు...కాలిబాట... ఎత్తులు, పల్లాలు... అటూ ఇటూ పిచ్చిమొక్కలు.. ఏయింటికాయింటికి నేల చదును చేసి ఏర్పరచుకున్న చిన్నచిన్న ఇళ్ళు.

అప్పుడు పదిగంటలయింది. కొండవాలుగా నీడపడుతూనే ఉంది ఇంకా.

ముందు వెళుతున్న అగంతకుడి వెనుకనే జాగ్రత్తగా అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు మధుబాబు.

ఎత్తుమీదకు అడుగులు వేస్తుండడంతో భుజాన వ్రేలాడుతున్న గుడ్డ సంచీ వీపు మీదకు జారిపోతున్నది.

"దగ్గరేనా?''

"అదే ఇల్లు... జనం ఉన్నారు చూడండి..అదే''

"రోజూ వస్తూంటారా అంతమంది జనం?..ఏం చేస్తుంటారామె?''

అతడు ఆగి విచిత్రంగా మధుబాబు ముఖంలోకి చూశాడు.

"రాత్రి ఆమె పోయారు కదా. మీకు తెలియదా!'' అన్నాడు.

ఉలిక్కిపడ్డాడు మధుబాబు అతడి ఆ మాట వింటూనే.

"పోయిందా?'' అతడి నోటివెంట మరో మాట రాలేదు కొన్ని క్షణాల వరకూ.

"మరి దేనికి వస్తున్నారు మీరు ఇక్కడకు? అది తెలిసికాదా?'' ఆశ్చర్యప డడం అతడి వంతయింది.

మధుబాబు నీరసపడిపోయాడు. ఇదెక్కడి నిజం!

అమ్మ స్నేహితురాలు పోయిందనే విషయం అతడిని అమితంగా బాధిం చింది. అంతకుమించి తన సమస్యకు పరిష్కారం దొరుకుతుందేమోనని వచ్చిన అతడిని మరింత అయోమయంలో పడేసింది.

ఆ మనిషి ముందు నడుస్తుంటే మధుబాబు ఏంచేయాలో తోచని వాడిలా అడుగులు వేస్తున్నాడు తడబడుతూ.

అక్కడ తనకు తెలిసినవాళ్ళు ఇంకెవ్వరున్నారని వెళ్ళాలి ఆమె పోయింత ర్వాత. ఆఖరుసారిగా ఆమె పార్థివ శరీరాన్ని చూసి వెనుదిరిగి వెళ్లడమే తను చేయగలిగినది. అత్తయ్య చెప్పినట్లు అమ్మ వెళ్ళిపోయిన కొద్దిరోజులకే అమ్మ స్నేహితురాలైన ఆ పిచ్చిది కూడా అమ్మను వెతుక్కుంటూ వెళ్ళిపోయింది'

నిజంగా ఆమే శ్రేయోభిలాషి అంటూ ఉత్తరాలు రాసి ఉంటే అందుకు కారణం ఇక తనకు తెలియనే తెలియదు.

ఆ ఇంటి సమీపానికి వచ్చారు ఇద్దరూ.

అక్కడంతా నిశ్శబ్దం. స్మశాన నిశ్శబ్దం.

ముందుకు వెళ్ళి జనం మధ్య నుండి తొంగిచూశాడు ఆమే...అక్కడ శవమై ఉన్నది తన తల్లి స్నేహితురాలే.

అంతగా ఆమెతో సన్నిహితత్వం లేకపోయినా ఓ జీవి మరణం మరో జీవికి వేదనే. మనస్సంతా దిగులుతో నీరసించిపోయింది.

అక్కడ వందమందిదాకా జనం ఉన్నారు.

ఒక పక్కన ఆమె నిర్జీవ శరీరపు అంతిమయాత్రకు ఏర్పాట్లు చకచకా జర గిపోతున్నాయి. లావుపాటి ఒక వ్యక్తి ఆ పనులు చేస్తున్నవారికి ఏవేవో పనులు పురమాయిస్తున్నాడు. తాటాకుల పంచలో కూర్చుని ఉన్న ఆడవాళ్ళు నోట్లో చెంగులు కుక్కుకుని విలపిస్తున్నారు.

అక్కడ ఏరాట్లుచూస్తున్న ఆ లావుపాటి ఆయన దగ్గరకు మధుబాబు వెళ్ళాడు.

"ఎలా పోయారు ఆమె?''

"వారంరోజులుగా జ్వరం వస్తోంది. ఆయాసం... ఆమె ఈ ప్రపంచంలో అందరికీ సేవ చేయాడానికే ముందు ఉంటుంది గాని తనకు మాత్రం ఎవరూ ఏ సేవా చేయకూడదు. అంత జ్వరంలోనూ ఆమె పనులు ఆమే చేసుకోవాలి. ఆమె త్రాగే జావ కూడా ఆమే కాచుకోవాలి. మేం ఏనాడు చేసుకున్న పుణ్యమో

## స్వేచ్ఛ

"నాన్నగారూ! మన దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడొచ్చింది?''

"నేను పుట్టినప్పుడు మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. మీ అమ్మను పెళ్లి చేసుకున్న తరువాత నా స్వాతంత్ర్యం పోయింది''

## అభిమానం

"నరేష్! సురేష్ ఎందుకేడుస్తున్నాడు?''

"వాళ్ల నాన్న దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.''

"ఉత్తరం వస్తే ఎందుకు ఏడవడం?''


"వాళ్ల నాన్న ఉత్తరంలో 'చిరంజీవి సురేష్' అని వ్రాసారు. వీడేమో బాలకృష్ణ అభిమాని. బాలకృష్ణ పేరు వ్రాయకుండా చిరంజీవి పేరు వ్రాసి నందుకు ఏడుస్తున్నాడు.''

## భవిష్యత్తు

"సార్! మీ వాతావరణ శాఖలో పని చేయడానికి జ్యోతిష్యం చెప్పే అనుభవం వున్నవారినే తీసుకుంటాము అంటున్నారు ఎందుకు?''

"వర్షం ఎప్పుడు వస్తుందో చెప్పే పరికరాలు పని చేయకపోతే జ్యోతిష్యం ద్వారా ఎప్పుడు వస్తుందో చెప్పడానికి?''

-షేక్ అస్లాం షరీఫ్ (శాంతినగర్)



ఆమె మా నడుమ వెలసింది. మా అందరికీ ఆమే తల్లి. మా ఇళ్లల్లోని బాధలు ఆమె బాధలు. మా ఆనందాలే ఆమె ఆనందాలు... మా దుఃఖమే ఆమె దుఃఖం...'' ఆయన కళ్ళు తడుస్తున్నాయి. ఆయన గొంతు బొంగురుపోతున్నది.

"ఆమె ఎక్కడ జన్మించిందో తెలియదు..ఎక్కడ పెరిగిందో తెలియదు... ముప్ఫయి సంవత్సరాల క్రితం ఇక్కడ ప్రత్యక్షమై, మా నడుమ, మాతో, మా మనిషిగా, మాలో ఒకరిగా తిరిగి ఈనాడు మమ్మల్ని అందర్నీ అనాథలుగా చేసి భగవత్ సాన్నిధ్యానికి వెళ్ళిపోయింది''

ఆయన మాటలు మధుబాబుని కదిలించివేస్తున్నాయి.

అత్తయ్యకు ఆమె పిచ్చిదిలాగానే కనబడవచ్చు గానీ ఇక్కడ ఉన్న వీళ్లందరికీ ఆమె దేవత!

కొద్దిక్షణాల తర్వాత ఆయన కోలుకుని "ఇంతకీ చెప్పనేలేదు. మీరు ఎక్కడినుంచి వచ్చారు? మా అమ్మ నీకెలా తెలుసు? ఇంతకుముందు మిమ్మల్ని చూసిన గుర్తు రావడంలేదు నాకు!'' అన్నాడు.

మధుబాబు క్షణం తటపటాయించాడు. "నేను గుంటూరు నుంచి వస్తున్నాను. శంకరమణెమ్మ గారు మా అమ్మకు స్నేహితురాలు.. నా పేరు మధుబాబు.. ఆమె పోయిన సంగతి నాకు ఇక్కడకు వచ్చేటంతటి వరకూ తెలియదు. చూసి వెళ్దామని వచ్చాను''

ఆయన కళ్ళు రెపరెపలాడిస్తూ మధుబాబు వంక చూశాడు.

"మీరాబాబూ! ఈమధ్య మీకు కొన్ని ఉత్తరాలు రాసి నాచేత పోస్టు చేయించింది. నిన్న సాయంత్రమే ఇంకొకటి నాకు ఇచ్చి ఈరోజు పంపమన్నది. తరువాత కొన్ని గంటలే ఆమె జీవించి ఉన్నది''

గుండె దడదడలాడుతుండగా ఉక్కిరిబిక్కిరి అయ్యాడు మధుబాబు. 'అయితే ఆమేనన్నమాట తనకు ఇన్నాళ్ళూ శ్రేయోభిలాషినంటూ ఉత్తరాలు రాసింది. ఆమేనన్నమాట తన భవిష్యత్తు అద్భుతంగా ఉండాలని ఆశిస్తూ తనను ఆశీర్వదించింది. ఆమేనన్నమాట తన యశస్సును కోరుకున్నది. ఆవేశాన్ని ఆపుకోలేకపోయాను. ఆ చివరి ఉత్తరంలో ఏం రాసిందో?''

"ఏది ఎక్కడున్నదది?'' అన్నాడు త్వరత్వరగా.

ఆయన ఆ పాకలోకి వెళ్ళి రెండు నిముషాల్లోనే ఒక పెద్ద కవర్ తీసుకు వచ్చి ఇచ్చాడు. ఆత్రంగా అందుకున్నాడు మధుబాబు.

అక్కడున్న జనమంతా అతడినే కళ్ళు పెద్దవి చేసుకు చూస్తున్నారు.

అతడు కవర్ తెరచి కళ్ళు చింపుకుని అందులోని అక్షరాల్లోకి దూసుకుపోతుండగా...

ఒక్కసారిగా క్రిందగా ఉన్న నరసింహస్వామి గుడి గాలిగోపురం మీద నుండి పావురాళ్ళ గుంపు ఎవరో తుపాకీ పేల్చినట్లుగా పెద్ద శబ్దంతో రెక్కలు టపటపలాడిస్తూ ఆకాశంలోకి లేచాయి.

★ ★ ★

ఫెళఫెళమంటూ చితి ఎర్రటి మంటల్ని లేపుతూ మండిపోతోంది. వాటి నుండి లేస్తున్న నిప్పురవ్వలు ఆకాశంలో నక్షత్రాల మధ్య చోటేమైనా దొరుకుతుందేమో అన్నట్లుగా పైపైకి ఎగిరిపోతున్నాయి. నల్లటిపొగ శవం కాలుతున్న వాసనను ఒంటికి పూసుకుని అక్కడ అడవిలా పెరిగిన చెట్లను, పరిసరాలను ఆక్రమించుకుంటున్నది.

అంతమంది మనుష్యుల మధ్య పేర్చిన చితి మీద శంకరమణెమ్మ నిర్జీవ శరీరం నిప్పులా మండిపోతున్నది.

పక్కగా తడిగుడ్డలతో నిల్చొని ఆ చితినీ, ఆ మంటల్నీ చూస్తూ ఆ వేడిని అనుభవిస్తున్న మధుబాబు కళ్లల్లో తడి ఆరిపోగా అవి జ్యోతుల్లా వెలిగిపోతున్నాయి నెత్తుటి ముద్దల్లా. కాలుతున్న ఆ శరీరాన్నే పరికిస్తూ.


అతడి చేతిలో శంకరమణెమ్మ చివరిగా రాసిన ఉత్తరం ఉంది. అతడి తడి తలనుండి జారిపడుతున్న నీటిబొట్లు ఆ ఉత్తరాన్ని ఆప్యాయంగా స్పృశిస్తున్నాయి. కాలిపోతున్న కనుగుడ్లను సేదదీరుస్తున్నట్లుగా రెప్పలు మూసుకుపోతున్నాయి.

'తన తల్లులిద్దరూ ఆ విషయాన్ని తమ జీవితాంతం రహస్యంగానే ఉంచాలనుకుంటూ చేతిలో చేయి వేసుకుని వాగ్దానాలు చేసుకున్నప్పుడు..తను మాత్రం దానిని లోకానికి చాటి వాళ్ల ఆత్మలకు క్షోభనెందుకు చేకూర్చాలి!'' ఎండిన పెదాలు అల్లల్లాడుతుండగా గొణుక్కున్నాడు.

రెండుచేతులూ ఎత్తాడు చితికి నమస్కరిస్తున్నట్లుగా.

కొద్దిగా ముందుకు వంగి తన చేతిలోని ఆమె రాసిన ఆ ఉత్తరాన్ని చితి మధ్యలో మరెవ్వరికీ ఆ విషయం తెలిసే అవకాశం లేకుండా ఆమెలోనే కలిసిపోయి ఆమెలాగానే కాలి బూడిదయ్యేలా ఆ అగ్నిజ్వాలలకు అర్పించి వేశాడు మధుబాబు.

★



## రుసరుసలు

మీడియా తీరు ఒక్కోసారి తారలకి విసుగును తెప్పిస్తుంది. సినిమా తారలు ఒకరితో ఒకరు పోటీ పడుతుంటారు. ఒకోసారి ఈ పోటీ తీవ్రస్థాయికి చేరుకుంటుంది. 'నాచ్' చిత్రంతో అందరిదృష్టిలో పడిన అంత్రామాలి "మీడియా అర్థంలేని పోలికలతో తారల్ని విసిగిస్తోంది అంటూ రుసరుసలాడుతోంది. ఎవరో తారతో నన్ను పోల్చడం ఏం బాగా లేదు. ఎవరి టాలెంట్ వారిదే. ఒకరి ఎలా ఉన్నారో మనమూ అలాగే ఉండాలనుకోవడం ఏంటి?'' అని కోప్పడుతోంది అంత్రామాలి.

